వాకర్స్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చా: ఎమ్మెల్యే



హరిణ వనస్థలి పార్కులో వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మన్సూరాబాద్: వాకర్స్‌కు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చానని, వాకర్స్‌కు మరిన్ని వసతులు కల్పిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి ఆటోనగర్‌లోని హరిణ వనస్థలి జాతీయ పార్కులో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మంగళవారం మార్నింగ్‌వాక్ చేపట్టి వాకర్స్ సమస్యలను తెలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వాకర్స్ విజ్ఞప్తి మేరకు మూత్రశాలలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. వాకింగ్ ట్రాక్ మధ్యలో, చుట్టుపక్కల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, ట్రాక్‌ను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. వాకర్స్‌కు సమస్యలను పరిష్కరిస్తానని, రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, వాకర్స్ సభ్యులు సునీల్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు



డీజీ జనార్దన్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి ఉత్సవాలను బండ్లగూడ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)లో జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత రవికుమార్ నర్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ గొప్ప మేధావి అని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం జీఎస్ఐ అసోసియేషన్ నేతలు ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీఎస్ఐ డీడీజీలు డాక్టర్ లాలన్‌సింగ్, ఎస్ఎస్ మహాపాత్ర, అన్షుమాన్ ఆచార్య, డాక్టర్ ఎంఎన్ ప్రవీణ్, కేవీ మారుతి, అనూప్ ఎన్ కాంబ్లే, హర మోహన్ మిశ్రా, తారకేశ్వర్‌రావు, అసోసియేషన్ నేతలు శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమనేతను గెలిపించుకుందాం: కొప్పుల



మన్సూరాబాద్ చిత్రసీమ కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



శ్రీపురం కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

మన్సూరాబాద్: ఉద్యమనేత, పాలనలో అనుభవజ్ఞుడైన ఈటల రాజేందర్‌ను గెలిపించుకుందామని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి విజ్ఞప్తిచేశారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని చిత్రసీమకాలనీ, మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద బీజేపీ కరపత్రాలను పంచుతూ బీజేపీని గెలిపించాలని ప్రచారం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, మొరిశెట్టి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాగర్ కాంప్లెక్స్, శ్రీపురం కాలనీలలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటెయ్యాలని మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశప్రజలంతా మోదీ వైపు ఉన్నారని, మల్కాజిగిరిలో ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పద్మారెడ్డి, కాలనీల ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, జంగయ్యగౌడ్, కిషోర్, రాజేందర్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ సేవా



ఊరేగింపులో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడలో శ్రీరామభక్త సమాజం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా సోమవారం రాత్రి ఆంజనేయస్వామి ఊరేగింపు (సేవా) ఘనంగా జరిగింది. మంగళవారం తెల్లవారుజాము వరకు ఊరేగింపు కొనసాగింది. సాయిలాల్‌తోట శివాలయం నుంచి పూలతోట, భరత్‌నగర్, కుర్మగూడ బస్తీల మీదుగా కొనసాగింది. యువజన సంఘాల వారు వేదికలు ఏర్పాటు చేసి ఊరేగింపునకు స్వాగతం పలికారు. చిన్నారులు వివిధ దేవతామూర్తులు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుర్మగూడ భజరంగ్ వ్యాయామశాల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాదన్నపేట పోలీసులు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరించండి

మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసుల వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని త్రిశక్తినగర్, బీరప్పగడి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం కోరారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్‌కు ఈమేరకు వారు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కొంత కాలంగా త్రిశక్తి కాలనీలో 1000 ఫీట్లు మేర బోర్లు వేసినా నీళ్లు రావడం లేదన్నారు. దీనికి తోడు కాలనీలో కృష్ణతాగునీరు సరిపడా సరఫరా చేయడం లేదని తెలిపారు. కాలనీలో సీసీ రోడ్లు వేయాలని, డ్రైనేజీ సమస్య తీర్చాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో పలుమార్లు ఆయా సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. ఇప్పుడైనా స్పందించి సమస్య పరిష్కరించకుంటే కాలనీవాసులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్, పీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్



రవూఫ్, షాకీర్‌లను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్‌ఆర్, నిజాముద్దీన్

పహాడీషరీఫ్: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్, పీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్‌లు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో జల్‌పల్లి మున్సిపాలిటీలోని బీఆర్ఎస్ నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు పార్టీ మారగా, తాజాగా బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్, ప్రధాన కార్యదర్శి మిర్జా షాకీర్ బేగ్‌లు తమ అనుచరులు ఫైసల్ ఖాన్, మహ్మద్ సాజిద్, మహ్మద్ ముజమిల్, సయ్యద్ అలీ పాషలతో కలిసి మంగళవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్, పీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్‌లు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ పాలనలో ముస్లిం, మైనార్టీలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. లౌకిక పార్టీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేసేందుకు తమ వంతుగా ఎంపీ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి వర్కింగ్ ప్రసిడెంట్ ఎంఎ బారీ, సీనియర్ నాయకుడు చలువాది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పవన సుత హనుమాన్ కీ జై!

ఘనంగా హనుమాన్ జయంతి

కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభం

చైతన్యపురి/మలక్‌పేట: ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎటుచూసినా కాషాయ జెండాల రెపరెపలు.. జై శ్రీరామ్.. జైజై హనుమాన్ నినాదాలు హోరెత్తాయి. ఆలయాల వద్ద ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

- కర్మన్‌ఘాట్‌లోని పురాతన ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో కాంతేంద్ర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ ఆలయం నుంచి ప్రారంభమైన బైక్‌ర్యాలీ సంతోష్‌నగర్, సైదాబాద్, సరూర్‌నగర్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్ మలక్‌పేట మీదుగా కోఠి వరకు జై ఆంజనేయ నినాదాలతో సాగింది. వేలాది మంది భక్తులు ర్యాలీలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో స్వాగత వేదికలు ఏర్పాటు చేసి ర్యాలీకి స్వాగతం పలికారు. పులిహోరా తాగునీరు పంపిణీ చేశారు.



కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయం నుంచి వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ



ర్యాలీలో ప్రసంగిస్తున్న మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



చైతన్యపురిలో.. మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి



ఓల్డ్‌మలక్‌పేటలో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



దిల్‌సుఖ్‌నగర్ వెంకటాద్రి థియేటర్ స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



దిల్‌సుఖ్‌నగర్ మారుతి మందిర్‌లో కాంగ్రెస్ నేత బద్దం సురేందర్ రెడ్డి



అన్నదానంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



పాల్గొన్న గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



కర్మన్‌ఘాట్ ఆంజనేయ ఆలయంలో.. కాంతేంద్ర స్వామి తదితరులు



గడ్డిఅన్నారంలో అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత సంఘిరెడ్డి



మలక్‌పేట హరిహర క్షేత్రంలో...



ఇంద్రానగర్‌లో మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు



సరూర్‌నగర్‌లో.. ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ తదితరులు



కొత్తపేటలో .. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు

వనస్థలిపురంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ..



రాములవారి రథం వద్ద పూజల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కుటుంబసభ్యులు

వనస్థలిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌ల్లో హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. హిల్ కాలనీలోని రామాలయం వద్ద ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా రాముల వారు, హనుమాన్ రథాలకు పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది యువకులు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కళాకారుల విన్యాసాలు, బ్యాండ్ డోలు వాయిద్యాల మధ్య యాత్ర సాగింది. రామాలయం నుంచి ప్రారంభమై యాత్ర.. గురుద్వార్, గవర్నమెంట్ ఆసుపత్రి చౌరస్తా, ఎస్‌కేడీనగర్, వైదేహినగర్, శివసింధు చౌరస్తాల మీదుగా సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయం వరకు సాగింది. బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, నాయకులు కమలా సుధీర్‌రెడ్డి, చింతల రవికుమార్, లగ్గోని శ్రీధర్‌గౌడ్, సంజయ్‌కుమార్, ఆనంద్‌రాజ్, అజయ్, చిరంజీవి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



యాత్రలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

రేపు మండల సర్వసభ్య సమావేశం

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం మందిరంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్ అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు మండల సర్వసభ్య దృష్టికి తీసుకొచ్చి పరిష్కార మార్గాలను ఎంచుకోవాలని కోరారు. ఈ సమావేశానికి ఎంపీటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

ఓటు వజ్రాయుధం

తుర్కయంజాల్: ప్రతి ఓటరు ఓటుహక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో మెప్మా సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో గడిచిన కొన్నిరోజులుగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఓటు వజ్రాయుధం లాంటిదని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఈఈ హరీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు అమలు



ఉప్పల శ్రీనివాస్ గుప్తాను కలిసిన భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నాగోలు: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నాగోలులోని పర్యాటకాభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా నివాసానికి వచ్చి తనకు మద్దతు ఇచ్చి, తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్ గుప్తా కచ్చితంగా తన మద్దతు ఉంటుందని, త్వరలోనే భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కిరణ్ కుమార్ తరపున ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తట్టి అన్నారం మైసమ్మ టెంపుల్ చైర్మన్ సుక్క శ్రీనివాస్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ డివిజన్ దళిత సంఘం అధ్యక్షుడు జోగు రాములు, చిరంజీవి గౌడ్, భవాని గౌడ్, సాయి గౌడ్, మాల వెంకట స్వామి, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు తదితరులు ఉన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో..) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 60, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 19, క్యారెట్ 37, దొండ 28, ఆలు 35, ఉల్లి 19, గోకర 36, దోస 16, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 37, మునగ 28, చిలగడదుంప 70, బీట్‌రూట్ 19, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ 65. బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

మల్కాజిగిరి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా..

మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల



విశ్వకర్మల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నాగోలు: విశ్వకర్మలు నిండు మనస్సుతో తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. కుందారం గణేశ్ చారి అధ్యక్షతన మంగళవారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఎల్బీనగర్ –ఉప్పల్ నియోజకవర్గాల విశ్వకర్మల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. రెండు నియోజకవర్గాల విశ్వకర్మ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వమేనని, తనను గెలిపిస్తే మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్‌కు కేంద్రంలో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, ఆ పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తే ఒరిగేది ఏమీ ఉండదన్నారు. ఇక్క బీఆర్ఎస్‌ను ప్రజలను నమ్మే పరిస్థితి లేదన్నారు. కాగా, సమావేశంలో పాల్గొన్న విశ్వకర్మలంతా ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.

అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తుల బదిలీ

రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.మాధవీలత భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.హనుమంతరావు నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిరను మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా నియమించగా, ఆమె స్థానంలో చేవెళ్ల అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి పి.శ్రీదేవి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైకోర్టు ఉత్త ఉత్తర్వులు జారీ చేసింది. వీరితో పాటు రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న మొత్తం 32 మంది న్యాయమూర్తులను బదిలీ చేసింది. బదిలీ అయిన వారు వచ్చే నెల 2వ తేదీలోపు తమ తమ నూతన స్థానాల్లో విధులు చేపట్టాలని హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

నాగోలు: పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కమలా సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాగోల్ డివిజన్ పరిధిలోని శివపురి కాలనీలో గడప గడపకూ బీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కమలాసుధీర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓట్లను కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, ఎల్‌బీ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాళ్లు రంగేశ్వరి, శిల్పారెడ్డి, కవిత, రంజిత్ గౌడ్, శ్రీధర్ గౌడ్, ఉమ, మంగమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ రవీంద్రనాథ్‌సింగ్‌కు జ్యేష్ట ఆచార్య పురస్కారం



పురస్కారం అందుకున్న డాక్టర్ రవీంద్రనాథ్‌సింగ్

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని భోజిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రనాథ్‌సింగ్ విద్య, పరిశోధన రంగాలలో చేసిన కృషికి గాను భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ సంస్థ జ్యేష్ఠ ఆచార్య పురస్కారాన్ని అందజేసింది. ఆదివారం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీటీయూ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్దా చంద్రశేఖర్, ఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ రవీంద్రనాథ్‌సింగ్ అవార్డ్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వినయ్‌నగర్ కాలనీలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి చోరీ

చంచల్‌గూడ: పక్క రాష్ట్రంలో శుభకార్యానికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మాదన్నపేట పీఎస్ పరిధిలోని చావణీలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చావణీలో నివాసముండే మహ్మద్ అజర్ గత శనివారం శుభకార్యం నిమిత్తం అనంతపూర్ వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చసరికి మెయిన్ డోర్ తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులోని 3 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఇంట్లో చోరీ జరిగినట్లు గ్రహించిన బాధితుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు స్పష్టం చేశారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లిలో గల ప్రైవేట్ బాలికల, బాలుర హాస్టల్స్ యాజమాన్యులతో మంగళవారం ఆయన సమావేశమై మాట్లాడారు. హాస్టల్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని కోరారు. బాలికల హాస్టళ్లలో తప్పనిసరిగా మహిళా ఉద్యోగులను నియమించుకోవాలని, సీసీ కెమోరాలు ఏర్పా టు చేసుకోవాలని సూచించారు. హాస్టల్స్‌లో చేరిన ప్రతి విద్యార్థి, వ్యక్తుల పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పారు. విజిటర్స్ రిజిస్టర్‌ను విధిగా నిర్వహించాలని అన్నారు. సైబర్ క్రైంకు సంబంధించిన విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. యజమానులు ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ సత్యానారయణ, ఎస్ఐ మారయ్య, హాస్టల్ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365